పెద్దింటి పిల్ల

మిస్ కె. మధుబాల

ఆమె వయసు వూహాతీతంగా వుంది. పద్ధెనిమిది నుంచి ఇరవై ఎనిమిదిదాకా ఆమె వయస్సు ఎంతైనా వుండొచ్చని చూసేవాళ్ళు అనుకోవచ్చు.

ఆమె ఖరీదైన మైసూర్ సిల్కు చీర ధరించింది. మెళ్ళో చక్కటి గొలుసుంది. జడ పొడుగ్గా కిందకు వాలింది. పెద్ద కళ్ళు. యాపిల్ పళ్ళలా వున్న పెదిమలు. తెల్లటి పళ్ళు.

ఎడంచేతికి చక్కటి వాచ్. కుడిచేతికి మూడు బంగారం గాజులు. ఆమె వేసుకొన్న స్లిప్పర్లు చీర రంగులో వున్నాయి.

ఫియట్ కారు పక్కనే ఆమె నిలబడి వుంది. రోడ్డమ్మట పోతున్న కార్ల వైపు ఆమె చూస్తోంది. మారుతీ కారు ఆమె పక్కనే ఆగింది. ఒక యువకుడు నవ్వుతూ ఆమెవంక చూశాడు.

"మిస్ ఎనీ ట్రబుల్?" అడిగాడతను.

“బాడ్ లక్! ఇంజన్ ట్రబులిస్తోంది.”

“నా కారులో రండి. తర్వాత మీ కారుకోసం మెకానిక్‌ను పంపొచ్చు” అన్నాడతను.

“థాంక్స్” అని ఆమె కారు కిటికీ అద్దాలను ఎత్తి తలుపులను లాక్ చేసింది,

ఉషారుగా వచ్చి అతడి పక్కనే ముందుసీటుమీద కూర్చుని తలుపు మూసింది.

అతడు కారును పోనిచ్చాడు, ఓరగా ఆమెవంక చూస్తూ.

చక్కటి సెంటు సువాసన ఆమెనుంచి గాలిలో వ్యాపిస్తోంది.

“నా పేరు గోపాలరావు, మీరు గోపాల్ అని పిలవొచ్చు” అన్నాడతను.

“నా పేరు రీతా” అందామె.

“ఎక్కడికెళ్ళాలి?”

ఆమె నవ్వుతూ అతడివంక చూసింది.

“చిన్న సహాయం చేస్తే నేను సంతోషిస్తాను” అందామె.

“ఏం కావలసినా చెప్పండి. నేను ప్రస్తుతం ఫ్రీగానే వున్నాను.”

“మా మెకానిక్ వర్క్‌షాపుకు పదండి. కారు ఇగ్నిషన్ కీ అతడి కిచ్చి, వెళ్ళి నా కారును చూడమంటాను. ఈ దేశంలో రోడ్డువారగా కారును ఎక్కువసేపు వదిలేస్తే గూండాలు అన్నీ పీక్కుపోతారు” అందామె.

“యూ ఆర్ రైట్! మీ మెకానిక్ ఎక్కడున్నాడు?” ప్రశ్నించాడతను.

"టివ్రా ఆటోమొబైల్ వర్క్‌షాప్, పాంథియన్ రోడ్డులో వుంది."

అతడు కారును అటువైపు పోనిచ్చాడు. సాయంత్ర సమయం. సూర్యుడు అస్తమించాడు.

కాని యింకా చీకటి పడలేదు. ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళు, కాలేజి స్టూడెంట్లు యిళ్ళకు బస్సుల్లో పోతు న్నారు.

టివ్రా వర్క్‌షాపు ముందు అతడు కారును ఆపాడు. గ్రీస్ మరకలతో మాసిన ఖాకీ దుస్తులు ధరించిన ఒకతను కారు దగ్గరకొచ్చాడు. ఆమె దగ్గరకు వెళ్ళమని గోపాల రావు సౌజ్ఞ చేశాడు.

కారు ఇగ్నిషన్ కీని ఆమె అతడి కిచ్చింది.

"కెనాల్ రోడ్డు వారగా వుంది నా ఫియట్ కారు. అది రిపేరుచేసి ఇక్కడ వుంచండి. తర్వాత ఇక్కడి కొచ్చి తీసుకెళ్తాను" అందామె.

"ఫియట్ కారు నంబరెంతమ్మా?" మెకానిక్ అడి గాడు.

ఆమె చెప్పింది.

"వెంటనే వెళ్తానమ్మా" అన్నాడతను.

ఆమె గోపాలరావుకేసి చూసింది.

"చాలా థాంక్స్ మీకు. కారును పోనీయండి" అందామె.

కారు స్లో స్పీడులో వెళ్తోంది. ఎదురుగా టాక్సీస్టేండు కనిపించింది.

"ఇక్కడ నన్ను దింపేస్తే టాక్సీలో పోతాను" అందామె.

"నా కారు టాక్సీ అనుకోండి!"

ఆమె కిలకిల నవ్వింది. కళ్ళు చిట్లించి అతడి వంక చూసింది.

"మీరు ఏం చేస్తున్నారు?"

"అన్నయ్యా, నేనూ మా తండ్రిగారు స్థాపించిన ఫ్యాక్టరీలను చూసుకుంటున్నాం. నాన్నగారు చని పోయారు. మాకు ఒక్కతే చెల్లెలు. ఆమెకు పెళ్ళయి పోయింది. అన్నయ్యకు పెళ్ళయి సంవత్సరమైంది. వదిన గర్భవతి. ఆమె త్వరలో పుట్టింటికి వెళుతుంది. ఇంట్లో అమ్మా, అన్నయ్యా, వదినా, నేనూ వుంటున్నాం."

"మీ చరిత్ర చెప్పేశారు. నా గురించి కూడా చెప్ప మంటారా?"

"చెప్పండి."

"అండీ అనడం మానేస్తే చెప్తాను."

"చెప్పు రీతా! నువ్వు నన్ను గోపాల్ అని పిలవాలి" అన్నాడతను.

"ఆల్ రైట్. అమ్మా నాన్నా అమెరికా వెళ్ళారు. నా తండ్రి పేరు మీరు వినే వుంటారు, జాన్ సన్. ఆయన పేరుపొందిన ఆర్కిటెక్ట్. నాకొక అన్నయ్య మాత్రం వున్నాడు. ఎమ్మెస్ పాసయి ఎమ్.బి.ఎ. చేస్తున్నాడు. అతడి పేరు శామ్సన్. నేను క్రిస్టియన్ కాలేజీలో బి. ఎ. ఫైనలియ్యర్ చదువుతున్నాను. లిటరేచర్ నా సబ్జెక్టు" అందామె.

అతడు స్పీడు తగ్గించాడు.

"ఇలా చాలా దూరం వచ్చేశాం. నీ మాటలు వింటూ లోకాన్నే మర్చిపోయాను. మీ యిల్లెక్కడ?"

"ఇంకా వెళ్ళాలి."

హోటల్ ఇరోజ్ నేమ్ బోర్డు చూశాడతను.

"కాస్త కాఫీ తాగుదాం వస్తావా?"

"పద తాగుదాం" అందామె.

అతడు కారును హోటల్ ఇరోజ్ కాంపౌండులోకి పోనిచ్చాడు.

2

ఆమె ఇంటికి కొంచెం దూరంగా అతడు కారు ఆపాడు. కారులోనే కూర్చుని సిగరెట్ వెలిగించాడు. పొగ పీల్చి వదుల్తూ టైమ్ చూశాడు. ఐదు కావస్తోంది.

గేటు దాటి ఆమె బయటకొచ్చింది. సమీపంలో ఆగిన కారువైపు ఆమె చూసింది. గబగబా అటువైపు నడిచింది.

ఆమెకేసి గోపాల్ నవ్వుతూ చూశాడు.

"హై, రీతా!" అన్నాడతను.

"హై, గోపాల్" ఆమె ముందుసీటుమీద కూర్చుని తలుపు మూసింది.

అతడు కారును పోనిచ్చాడు.

"నువ్వు వస్తావో రావో అనుకున్నాను!"

"లక్కీ, అన్నయ్య ఇంట్లో లేడు. వుంటే వెయ్యి ప్రశ్నలు వేసేవాడు" అందామె.

"క్రిస్టియన్స్ చాలా ఫ్రీగా వుంటారని నేననుకొంటున్నాను" అన్నాడతను.

"అదంతా నీ యిమాజినేషన్. మేం కన్వర్టెడ్ క్రిస్టియన్స్. మతం మారినా పాతకాలపు అలవాట్లు మాలో పోలేదు" అందామె.

"మాలాగే మీరూ వున్నారన్న మాట!" అన్నాడతను నవ్వుతూ.

హోటల్ ఇరోజ్‌లో టిఫిన్ తిని, కాఫీ తాగి యిద్దరూ బయటకు నడిచారు.

"మహాబలిపురం వెళ్దామా?" అన్నాడతను.

"ఎందుకు?" అడిగిందామె అమాయకంగా.

"అక్కడ మనం ఏకాంతంగా కూర్చోవచ్చు" అన్నాడతను.

"మా యింటికి పోదాం, పద. అక్కడ యెవ్వరూ లేరు. అన్నయ్య రాత్రి పన్నెండు దాకా తిరిగి రాడు" అందామె.

"పద, వెళ్దాం" అన్నాడతను.

కారును వేగంగా పోనిచ్చాడతను. తేనాం పేటలోని ఒక పెద్ద యింటి కాంపౌండులోకి కారును పోనిచ్చి ఆపాడతను.

ఇద్దరూ కార్లోంచి దిగారు. ఏ నౌఖరూ కారు వైపు రాలేదు.

"మీ యింట్లో నౌఖర్లు లేరా?"

"పనిమనుషులు యింటిలోపల తిరుగుతూ వుండడం నాన్నకు నచ్చదు. వున్నా నౌఖర్లు పని ముగించి వెళ్ళిపోతారు. ఎవ్వరూ ఇక్కడ వుండరు" అందామె.

ఆమె ముందు లాక్ ని తెర్చింది. లోపలకు వెళ్ళాక ఆమె తలుపును మూసింది. ఏర్ లాక్ క్లిక్ మంది.

మేడ మెట్లెక్కి వాళ్ళు పైకి వెళ్ళారు. హాల్లో వున్న సోఫాలో అతడిని కూర్చోమని ఆమె లోపలకు వెళ్ళింది.

పది నిమిషాల్లో ఆమె తిరిగి వచ్చింది. పల్చటి నైటీ ధరించిందామె. లోపలున్న పావడా స్పష్టంగా కనిపిస్తోంది.

అతడి పక్కనే అదే సోఫాలో ఆమె కూర్చుంది.

"టీ తాగతావా?" అడిగిందామె.

"ఎవరు తయారుచేస్తారు?" అడిగాడతను.

"నే నే."

"నాకు టీ వద్దు. ఇలా నా పక్కన కూర్చో. నీకేసి చూస్తూ ఇలాగే వుండిపోతాను" అన్నాడతను.

అతడివంక చూసి ఆమె నవ్వింది.

"నీకు ఆడ స్నేహితులు లేరా?"

"సాధారణంగా ఆడవాళ్ళకు నేను దూరంగా వుంటాను."

"కారుపక్క నిలబడిన నన్ను చూడగానే పలకరించావు!" అందామె.

"నువ్వు ఏం కష్టంలో యిరుక్కున్నావో అని పలకరించాను" అన్నాడతను.

ఎలక్ట్రిక్ బెల్ మ్రోగింది. ఆమె కిందకు వెళ్ళింది. రెండు నిమిషాల తర్వాత తిరిగి వచ్చింది.

"డోర్ టు డోర్ కాన్వాసింగ్ చేసి సబ్బులమ్మే యువతులను చూస్తే నాకు ఒళ్ళు మండుతుంది! వాళ్ళ కోసం మెట్లు దిగి కిందకు వెళ్ళి పైకి రావాలి!" అందామె.

"నువ్వు యెక్కడ పడుకొంటావు!" అడిగాడతను విషయాన్ని మారుస్తూ.

"ఆ గదిలో" అందామె.

అతడు లేచాడు. మెల్లిగా ఆమె గదిలోకి నడిచాడు. వెనక నే ఆమె వచ్చింది.

"ప్లీస్, యీ గదిలోకి మరెవరేనా వస్తే అన్నయ్య తిడ్తాడు" అందామె.

"అన్నయ్య ఇప్పుడు ఇంట్లో లేడుగా?"

"లేకపోవచ్చు. ఈ గదిలో సిగరెట్ కాల్చి ఏమూలో పడేస్తావు. అన్నయ్య దాన్నిబట్టి పోలుస్తాడు."

"డోంట్ బాదర్, సిగరెట్ కాల్చనులే" అన్నాడతను.

ఎదురుగా ఫోమ్ బెడ్ వుంది. రెండు గాడ్ రెజ్ బీరువాలున్నాయి. గదిలో చిన్న టేబులు, రెండు కుర్చీలు వున్నాయి.

అతడు మెల్లిగా వెళ్ళి పరుపుమీద కూర్చున్నాడు. ఆమెవంక నవ్వుతూ చూశాడు. నైటీలో ఆమె రంభలా వుంది. ఆమె స్తనాలు కొట్టొచ్చినట్లు అగుపిస్తున్నాయి. అతడి రక్తంలో యెన్నో కోరికలు మిళితమై ప్రవహిస్తున్నాయి.

"రీటా, ఐ లవ్ యూ!" అన్నాడతను.

ఆమె దగ్గరగా నడిచింది. పరుపుమీద పక్కనే కూర్చుంది.

"సారీ, నిన్ను నేను లవ్ చేయలేను. నన్ను పెళ్ళాడబోయే వ్యక్తి అమెరికాలో వున్నాడు. అతడు తిరిగి రాగానే మా పెళ్ళి జరుగుతుంది."

ఆమెవైపు అతడు సూటిగా చూశాడు.

"అది ముందట్లోనే నాతో యెందుకు చెప్పలేదు? ఇంతవరకూ వచ్చాక నన్ను వెనక్కు పొమ్మంటే నేను యెలా పోగలను?" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. వెర్రిదానిలా అతడివైపు చూస్తూ వుండిపోయింది.

అతడి చేతులు ఆమెను చుట్టేశాయి. కళ్ళలోకి చూస్తూ అతడామె పెదిమలను పదే పదే ముద్దెట్టుకొన్నాడు.

"గోపాల్, నన్ను వదులు!" అందామె.

"నా ప్రాణం పోయినా నిన్ను వదలను. వదల్లేను" అన్నాడతను.

"నేను నిన్ను పెళ్ళాడలేను" అందామె.

"నన్ను పెళ్ళాడకపోయినా, ఈనాటి యీ దృశ్యం నా హృదయంలో చెరగని ముద్రలా వుండిపోతుంది" అన్నాడతను.

ఆమె బరువుగా వూపిరి పీల్చింది. అతడామెను పరుపు మీద పడుకోబెట్టి పక్కనే వాలిపోయాడు.

భయంతో ఆమె అతడివంక చూసింది.

"బయటకు పోదాం పద! నాకు భయంగా వుంది" అందామె.

కాని అతడామెను వదల్లేదు. ఆమె ముఖంమీద ముద్దుల వర్షం కురిపించసాగాడు. క్షణంలో యిద్దరూ మబ్బులమీద తేలిపోసాగారు. అమాంతంగా ఆమె అతడి వెనక తన చేతులను పెనవేసింది.

తటాలున తలుపును తోసి ఒకతను గుమ్మంలో యమ దూతలా నిలబడ్డాడు.

ఇద్దరూ కిందకు దూకారు. ఆమె బాత్‌రూమ్‌లోకి పరుగెత్తింది. తలుపును లోపలనుంచి మూసేసుకొంది.

తన పాంటు సర్దుకొని గోపాలరావు అతడివైపు గాభరాగా చూశాడు.

అతడు పొడుగ్గా, వస్తాదులా వున్నాడు. పాంట్, టీషర్ట్ ధరించాడు.

అతడు వేగంగా బాత్‌రూమ్ ముందుకు వెళ్ళి తలుపును గట్టిగా కొట్టాడు.

"చెల్లీ, బయటకు రా!" అరిచాడతను.

ఆమె తలుపు తెరవలేదు. అతడు కోపంగా గోపాలరావు వంక చూశాడు.

"రాస్కెల్, నా చెల్లెల్ని రేప్ చేశావా? నిన్ను చావ

గొట్టి పోలీసులకు అప్పగిస్తాను" అరిచాడతను.

బాత్‌రూమ్ తలుపు తెరిచి ఆమె భయంతో బయట కొచ్చింది.

"అన్నయ్యా, అతడు నాతో యిక్కడకి వచ్చాడు. నేను యెంత వద్దన్నా వినకుండా ఆ స్థితికి లాక్కెళ్ళాడు" అందామె, ఏడుస్తూ.

అతడు గోపాలరావును చంపమీద గట్టిగా కొట్టాడు. ఈడ్చుకెళ్ళి అతడిని హాల్లోని సోఫాలో కూర్చోబెట్టాడు.

"నా సిస్టర్ని రేప్ చేశావు. ఆమెకు భవిష్యత్తు లేకుండా చేశావు. పోలీసు రిపోర్టు ఇస్తాను" అని అతడు ఫోన్ వైపు వెళ్ళాడు.

రిసీవర్ యెత్తి యేదో నంబరు తిప్పాడతను.

పరుగెత్తుకు వెళ్ళి గోపాలరావు నాబ్ నొక్కి ఫోన్ని డిస్‌కనెక్ట్ చేశాడు.

"మిస్టర్, అయిందేదో అయిపోయింది. కడుపును కోసుకుంటే నీ కాళ్ళమీదే పడ్తుంది. ఇప్పుడు నన్నేమి చేయమంటావో చెప్పు! పోలీసులు రావడం అటు ఆమెకూ ఇక నాకూ మంచిది కాదు."

"వెళ్ళి కూర్చో! నాలోని వుద్రేకం తగ్గాక నీతో మాట్లాడతాను" అన్నాడతను.

"అలాగే కూర్చుంటాను. లెటస్ సెటిల్ తింగ్స్" అన్నాడు గోపాలరావు.

అతడు మౌనంగా చెల్లెలున్న గదిలోకి వెళ్ళిపోయాడు.

హాల్లోని లైటు వెలుతోంది. గోపాలరావు టైమ్ చూశాడు. ఏడు దాటింది. కాలచక్రం తనకు తెలియకుండానే తిరిగిపోయింది!

పక్క గదిలోంచి రీతా ఏడుపు అతడికి వినపడ్తోంది.

గోపాలరావు హృదయం చివుక్కుమంది. ఆమెను తొందర పెట్టి అనవసరంగా కష్టాలపాలు చేసినందుకు అతడు లోలోపల విచారించసాగాడు.

సిగరెట్ వెలిగించి పొగ పీల్చి వదులుతూ గోపాలరావు ఆలోచిస్తున్నాడు. ఈ విషయం పోలీసులదాకా వెళ్ళకుండా తను జాగ్రత్తపడాలి! ఇది తెలిస్తే తన తల్లి ఆత్మహత్య చేసుకొని మరణిస్తుంది!

ఆమె అన్న రాకతో పరిస్థితి విషమించింది. రాత్రి ఏ పన్నెండింటికో రావలసిన వాడు అంతలో రావడం తన దురదృష్టమే! ఏదో చేసి యీ యమకూపంలోంచి బయటపడాలి! పీడకలగా భావిస్తూ జరిగినదంతా తను మర్చిపోవాలి!

3

గోపాలరావు కెదురుగా అతడు కూర్చున్నాడు.

"నా పేరు శామ్సన్. నీ పేరు గోపాలరావని చెల్లి చెప్పింది. నా చెల్లెలు జీవితాన్ని నువ్వు నాశనం చేసేశావు. ఆమె అమాయకురాలు. నువ్వు మంచివాడవనుకొని యింటికి రమ్మంది. ఇంటికొచ్చి ఆమె జీవితానికే ఎసరు పెట్టావు. ఇటుపైన ఆమె ఏడుస్తూనే వుంటుంది" అన్నాడతను.

అతడివైపు సూటిగా చూశాడు గోపాలరావు.

"ఆమె కన్నీళ్ళను తుడవడానికి నేను ఏం చెయ్యాలో చెప్పు!"

"ఏం చెయ్యగలవు? కొంత డబ్బివ్వగలవు, కాని పోయిన మానాన్ని ఆమె తిరిగి కొనుక్కోగలదా? నువ్వే చెప్పు!" అరిచాడతను.

గోపాలరావు తలదించుకొని కూర్చున్నాడు.

"నా తలిదండ్రులు అమెరికాలో వున్నారు. వాళ్ళు ఇక్కడ వుండి వుంటే, నాన్న కమ్చీతో నిన్ను కొట్టి చంపివుండేవాడు. వాళ్ళకు ఇది తెలిస్తే ప్రమాదం!"

గోపాలరావు మాట్లాడలేదు.

"అమ్మకూ, నాన్నకూ ఇది తెలియకుండా వుంచడమే మంచేది. అమెరికాలో వున్న డేవిడ్ నా చెల్లెల్ని పెళ్లాడ్డో లేదో నేను ప్రస్తుతం చెప్పలేను. తన కాళ్ళమీద ఆమె నిలబడాలి! మాన నష్ట పరిహారంగా నువ్వు ఆమెకు రెండు లక్షలు యివ్వాలి. అది నా చేతికి వెంటనే అందాలి. తర్వాత నీ దారిన నువ్వు వెళ్ళిపోవచ్చు. జరిగింది ఆమె మర్చిపోయి జీవిస్తుంది. నేనూ అంతా మర్చిపోతాను" అన్నాడతను.

"రెండు లక్షలా?" అన్నాడు గోపాలరావు ఆశ్చర్యంతో.

శామ్సన్ మొహం కోపంతో ఎర్రబడింది. అతడు పిడికిలి బిగించాడు. పిడికిట్లో వున్న మెటల్ యాష్ట్రే నలిగిపోయింది.

"ఆమె చేతిలో ఏ వందో పెట్టిపోదామనుకున్నావా?" గద్దించాడు శామ్సన్.

"కోపం తెచ్చుకోకు! లక్ష ఇస్తాను. అంతకంటె ఇవ్వలేను."

"నీతో బేరమాడ్డం కంటె పోలీసులకు ఫోన్ చేయడం మంచిది" అని శామ్సన్ లేచాడు.

టెలిఫోన్ వైపు నడిచాడు. గుండె దడతో గోపాలరావు వెళ్ళి అతడిని ఆపాడు.

"అలా కూర్చో! రెండు లక్షలు ఇస్తాను. నేను వెళ్ళి డబ్బు తెస్తాను."

"నువ్వెళ్ళి రాకపోతే?"

"నా మాట నమ్ము!"

"నా చెల్లెల్ని రేప్ చేసిన వాడి మాట నేను నమ్మను. నిన్ను నమ్మిన నా చెల్లెల్ని ఏం చేశావు?"

"ఆమె నన్నంతగా నిరాకరించలేదు. దగ్గరకు నేను వెళ్తుంటే ఆమె పూరుకొంది. నాతో పోట్లాడివుంటే నేనామెను వదిలేసి వుండేవాడిని."

"అదామెకు ఏం తెలుసు? నిన్ను యెదిరిస్తే పీకపిసికి చంపుతావేమో అని ఆమె భయపడింది. ఏడుస్తూ అదంతా నాతో చెప్పింది."

"ఆ డబ్బు నా చేతికెలా వస్తుంది నే నిక్కడనుంచి వెళ్ళకుండా" అడిగాడు గోపాలరావు.

"డబ్బు నా చేతి కందేకే నువ్వు ఇక్కడనుంచి కదులావు. ఏం చేయాలో నువ్వే ఆలోచించుకో? అది నీ సమస్య" అన్నాడు శాంసన్.

"నువ్వు యెవరినేనా నాతో పంపొచ్చు. కావలిస్తే నువ్వే రావచ్చు" అన్నాడు గోపాలరావు.

"ఎవర్నీ పంపను. నేను రాను."

"పై మెట్టుమీద కూర్చుని కిందకు దిగనంటే యెలా మరి? నువ్వు అడిగిన రెండులక్షలూ ఇస్తా అన్నాను. నేను ఇంటికి వెళ్ళాలి. నా అన్నయ్యతో మాట్లాడాలి."

"నువ్వు యేం చెప్పినా నేను వినను. నువ్వు ఇక్కడ నుంచి కదిలే ముందు డబ్బు నా చేతికి అందాలి."

నిస్సహాయంగా గోపాలరావు సిగరెట్ వెలిగించాడు.

"నీ జేబులో ప్రస్తుతం యెంతుంది?"

గోపాలరావు పర్సుతీసి చూశాడు.

"ఐదు వేలు పైన వుంది."

"ఆ పర్సు ఇలా ఇయ్యి."

గోపాలరావు పర్సును అతడికిచ్చాడు, అతడా పర్సును తన పాంటు జేబులో పడేసుకున్నాడు.

"ఇది నా దగ్గర వుంటుంది. రెండులక్షలు నాకొచ్చాక యీ పర్సు నీకిచ్చేస్తాను."

"నా దగ్గర సిగరెట్లు కొనుక్కోడానికికూడా డబ్బు లేదు!" అన్నాడు గోపాలరావు.

"నువ్వు నా అతిథివి. నీకు కావలసినవి నేను సప్లయి చేస్తాను."

అతడు కొంతసేపు హాల్లో పచార్లుచేసి గోపాలరావు వంక చూశాడు.

"నాతోరా!"

అతడి వెనకనే కదిలాడు గోపాలరావు. చిన్న పడ గదిలోకి ఇద్దరు ప్రవేశించారు. గదిలో మంచం వుంది. టెలిఫోన్ వుంది. యటాచ్‌డ్ బాత్‌రూమ్ తలుపు కని పిస్తోంది.

గదికి ఒకే కిటికీ వుంది. పైన ఫాన్ తిరుగుతోంది.

"ఆ టెలిఫోన్ను నువ్వు వుపయోగించుకోవచ్చు, రెండు లక్షలు ఫోను చెయ్యడానికి. మరే పనికీ ఆ ఫోను నీకు వుప యోగపడదు. నువ్వు ఫోన్‌లో చెప్పే ప్రతిమాటా నేను వింటాను. అండర్‌స్టేండ్!"

గోపాలరావు తలాడించాడు.

"నాకు గోల్డుఫ్లేక్ కింగ్స్ పది పాకెట్లు కావాలి. అగ్గిపెట్లు అరడజన్. స్కాచ్ విస్కీ సోడా వగైరా" అన్నాడు గోపాలరావు.

"అన్నీ నీ గదికి వస్తాయి. ఈ గదిలోంచి ఎలా బయటపడాలో దాన్ని గురించి ముందు ఆలోచించు!"

అన్నాడతను.

"ఆల్ రైట్, ఆలోచిస్తాను" అన్నాడు గోపాలరావు.

అతడు బయటకు నడిచాడు. తలుపు మూశాడు. తాళంవేసి వేగంగా వెళ్ళిపోయాడు.

4

గోపాలరావు రెండు పెగ్గుల స్కాచ్ విస్కీ తాగేసి, మూడో పెగ్ లో వున్నాడు. ప్లేటులో వున్న చిప్స్‌ను నవులుతున్నాడు.

అతడు మెల్లిగా వెళ్ళి టెలిఫోన్ పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. రిసీవర్ ఎత్తి తన ఇంటి నంబర్ తిప్పాడు.

"హాలో!" అందో స్త్రీ కంఠం.

"నేను వదినా, గోపాల్" అన్నాడతను.

"ఇంకా రాలేదేమిటి, ఎక్కడున్నావు?" అడిగిందామె.

"ఢిల్లీ నుంచి ఒక ఫ్రెండు వచ్చాడు. అతడితో ఒక ఇంట్లో వున్నాను. అన్నయ్య ఏం చేస్తున్నాడు?"

"అదుగో వచ్చారు" అందామె.

"ఏంరా గోపాల్?" అన్నాడు అన్నయ్య, కాసేపయ్యాక.

"అన్నయ్యా, నాకు వెంటనే రెండు లక్షలు కాష్ కావాలి."

"ఎందుకురా?" అడిగాడు అన్న రామారావు.

"ఏదో కొత్త బిజినెస్ కొనడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాను. కాష్ దగ్గరుండాలి."

"నువ్వు ఇంటికిరా, మాట్లాడుదాం."

"ఈ బిజినెస్ తేల్చుకుంటేగాని నేను ఇంటికి

రాలేను. నా ఫ్రెండు రేపు వెళ్ళిపోతున్నాడు."

రామారావు చాలా తెలివైనవాడు. తన తమ్ముడు ఎందులోనో ఇరుక్కుని వుండాలని అతడు గ్రహించాడు.

"ఎప్పుడు పంపాలి? ఎక్కడకు?"

"నా ఫ్రెండుతో మాట్లాడి చెప్తాను."

"చెప్పు" అని అన్న రిసీవర్ పెట్టేశాడు.

కాస్సేపట్లో గదిలోకి అతడు వచ్చాడు.

"మిస్టర్ శామ్సన్, డబ్బు ఇక్కడకు పంపమన్నా?"

"అది చెప్పడానికే వచ్చాను. వాణీ స్ట్రీట్ ఫ్లాట్ నంబరు 10కి పంపమను. రేపు పొద్దుట పన్నెండింటికి పంపమను. ఆ ఫ్లాట్‌లో నువ్వు లేకపోతే నీ మిత్రుడు రాజన్ వుంటాడని, డబ్బు అతడికిమ్మను."

"రాజన్ ఆ డబ్బుతీసుకు పారిపోతే?" అడిగాడు గోపాలరావు.

"రాజన్ యెక్కడికీ పారిపోడు. ఆ పేరుతో నే నక్కడ వుంటాను" అన్నాడతను.

"ఆల్ రైట్ అలాగే చేస్తాను" అన్నాడు గోపాలరావు.

"నీకు కాస్సేపట్లో డిన్నర్ వస్తుంది."

"థాంక్స్, తొందరగా తినే అలవాటు లేదు నాకు" అన్నాడు గోపాలరావు.

అతడు బయటకు నడిచాడు. తలుపు మూసి లాక్ చేశాడు.

మెల్లగా స్కాచ్ విస్కీ తాగుతూ గోపాలరావు అక్కడున్న పత్రికలను చూస్తున్నాడు. అన్న రామారావుతో అతడు మాట్లాడాడు. డబ్బును యెక్కడకు పంపవలసిందీ చెప్పాడు. పని పూర్తి అయ్యాక ఇంటికి

వస్తానన్నాడు.

"డోంట్ బాదర్! క్షేమంగా, లాభకరంగా బిజినెస్ చేసిరా" అన్నాడు అన్న.

గోపాలరావు తన వాచ్ వంక చూశాడు. టైము పది దాటింది.

అతడు మంచి నిషాలో వున్నాడు. అయినా ఇంకా తాగుతూనే వున్నాడు.

తాళం తీసిన చప్పుడైంది. కాసేపట్లో రీతా లోపలకు వచ్చింది. ఒక కేరియర్ని ఒక కంచాన్ని అతడి పక్కనే పెట్టింది.

"డిన్నర్ అందులో వుంది. నువ్వే పెట్టుకు తినాలి" అందామె.

"నువ్వెందుకిక్కడికొచ్చావు?" అడిగాడతను గాభరాగా.

"మరెవ్వరూ లేక."

"నీ అన్న ఏమయ్యాడు?"

"తన గదిలో వున్నాడు."

"జరిగినదానికి నన్ను క్షమించు!" అన్నాడతను.

"అన్నతో అలా చెప్పినందుకు నన్ను నువ్వు క్షమించాలి. అన్నంటే నాకు భయం. నా అంతట నేను నీకు లొంగిపోయానని చెప్తే అన్నయ్య నన్ను చంపుతాడు. అందుకని తప్పు నీమీదకు తోశాను" అందామె.

"నేనంటే నీకిష్టమేనా?" అడిగాడతను.

"నీ చేతుల్లో వుంటే నాకెంతో ఆనందంగా వుంది."

"నిజంగా?"

ఆమె తీయగా నవ్వింది.

అతడామె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"అన్నయ్య పిల్లిలా వస్తాడు. నేను వెళ్తాను, గుడ్ నైట్" అందామె.

మెల్లిగా ఆమె బయటకు వెళ్ళిపోయింది.

5

టైమ్ ఒంటిగంట దాటింది. తాళం తెర్చి, తలుపు తోసుకుని అతడు లోపలకు వచ్చాడు. గోపాలరావు వంక సూటిగా చూశాడు.

"నువ్వు ఇస్తానన్న డబ్బు నా చేతికి అందింది. నువ్వు ఇక వెళ్ళొచ్చు" అన్నాడతను.

గోపాలరావు సోఫాలోంచి లేచాడు. ఒక పర్సును అతడు గోపాలరావుకిచ్చాడు. దాన్ని తెర్చి చూశాడతను. అందులో రెండు వందరూపాయిలనోట్లు మాత్రం వున్నాయి.

"ఇందులో ఇంకా డబ్బు వుండాలి" అన్నాడు గోపాలరావు.

"అదంతా ఖర్చయింది. అందులో వున్నదానితో నువ్వు తృప్తిపడాలి" అన్నాడతను.

గోపాలరావు సిగరెట్ వెలిగించాడు.

"మిష్టర్, జరిగినది ముగ్గురికి మాత్రం తెలుసు. నా చెల్లెలికి, నీకు, నాకు. ఎప్పుడూ దీన్ని గురించి ఎక్కడా మాట్లాడకు. మళ్ళా ఈ ఇంటివైపు నువ్వు ఎప్పుడూ రాకూడదు" హెచ్చరించాడతను.

"కల్లో కూడా రాను" అన్నాడు గోపాలరావు.

తన వస్తువులన్నీ తీసుకుని గోపాలరావు బయటకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"థాంక్స్, వెళ్తా" అన్నాడు.

"నీకు ఏ ప్రమాదమూ రాకుండా నేను కాపాడగల్గాను. నాన్న అయితే దేనికీ లొంగేవాడు కాదు. ఎక్కడా వాగకు!"

"వాగనని హామీ యిస్తున్నాను."

అతడు గోపాలరావును బయటకు తీసుకు వెళ్ళాడు. గోపాలరావు తన కారులో కూర్చుని తలుపు మూశాడు.

"మిస్టర్ కామ్సన్, నీ చెల్లెలుకి నా గుడ్ విషెస్ అందజేయి. గాడ్ బ్లెస్ హర్!" అని అతడు కారును పోనిచ్చాడు.

కారును అతడు వేగంగా తన ఇంటివైపు పోనిచ్చాడు అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. రీతాకు తనంటే యిష్టమే! కాని అన్నంటే ఆమెకు భయం! ఆమెను గురించి ఆలోచిస్తూంటే ఎందుకో అతడికి జాలి కలిగింది!

ఇంటి ముందు కారాపి అతడు లోపలకు వెళ్ళాడు. హాల్లో కూర్చున్న తల్లి అతడివైపు నవ్వుతూ చూసింది.

"ఏమయ్యావురా, రాత్రి ఎక్కడున్నావు?" ప్రశ్నించిందామె.

"ఫ్రెండు యింట్లో వున్నానమ్మా" అని అతను పైనున్న తన గదికి వెళ్ళిపోయాడు.

తలుపు మూసి, అలసటగా పరుపుమీద పడుకున్నాడు. టెలిఫోన్ మ్రోగింది. వెళ్ళి అతడు రిసీవర్ని ఎత్తాడు.

"మీ అన్నగారు" అంది వదిన కిందనుంచి.

"హలో, గోపాల్" అన్నాడతను.

"ఒకేయ్, ఏమైంది? ఎందుకంత డబ్బు అర్జంటుగా కావలసి వచ్చింది" అడిగాడు అన్న రామారావు.

"అదంతా తర్వాత మాట్లాడుదాం" అన్నాడు

గోపాలరావు.

కిందనుంచి వదిన వాళ్ళ మాటలు వినొచ్చు! తనకు జరిగినది ఆమెకు తెలియడం గోపాలరావుకు ఇష్టంలేదు.

"ఆఫీసుకు వస్తున్నావా?"

"ఇవాళ రాను. నిన్న రాత్రి సరిగ్గా నిద్రపోలేదు. విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడతను.

"ఆల్ రైట్, హేవ్ సమ్ రెస్టు" అని అన్నయ్య రిసీవర్ పెట్టేశాడు.

రాత్రి అన్నయ్య రామారావు అతడి గదిలోకి వచ్చాడు. జరిగినదంతా అతడు అన్నయ్యతో చెప్పాడు.

"ఆమె అన్న నన్ను ఆ ఇంట్లో ఖైదీగా వుంచేశాడు. డబ్బిస్తేగాని కదలడానికి వీల్లేదన్నాడు. డబ్బు ముట్టాక నన్ను వదిలేశాడు" అన్నాడతను.

"ఆ ఇల్లు యెక్కడుంది?"

"తేనేంపేటలో. చాలా పెద్ద ఇల్లు. ఆమె తలిదండ్రులు ప్రస్తుతం అమెరికాలో వున్నారు."

"ఆ ఇంటిని గురించి మనం పూర్తి వివరాలు కనుక్కోడం మంచిది" అన్నాడు రామారావు.

"పోయిందేదో పోయింది వాళ్ళను గురించి దర్యాప్తు చేయడం ప్రమాదకరం. శామ్సన్, ఆమె అన్న మన్ని ముప్పుతిప్పలూ పెడ్తాడు. అది మర్చిపోదాం. ఇది ఎవ్వరికీ చెప్పకు. వదినకీ, అమ్మకీ తెలియకూడదు."

"చెప్పనులే" అన్నాడు రామారావు.

6

సంవత్సరం గడిచిపోయింది.

ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో వేలాది ప్రజలమధ్య గోపాలరావు తిరుగుతున్నాడు.

ఒక య్యాంగ్లోయిండియన్ యువతి ముందు నడుస్తోంది. ఆమె వంక పరీక్షగా చూసి అతడు వులిక్కిపడ్డాడు.

రీతా!

కొంత దూరం ఆమె వెనకనే వెళ్ళాడు. బ్రిటానియా బిస్కట్ల స్టాల్లోకి ఆమె నడిచింది. అదే స్టాల్లోకి దూరా డతను. ఆమెవంక పదేపదే చూడసాగాడు.

ఆమె రీతా కాదేమో అని సంశయిస్తూ వెనకనే కదిలాడు. రీతా లాగే వుంది ఆమె. కాని వయసులో పెద్దదిగా అగుపిస్తోంది!

స్టాల్లోంచి ఆమె బయటకు నడిచి చెట్టుకింద నిల బడింది. కొంచెం దూరంనుంచి అతడామెను చూస్తూ వుండిపోయాడు.

ఆమె గౌను వేసుకుంది. బాబ్డ్ హెయిర్. చేతులకు బంగారు గాజులు లేవు. ఖరీదైన వాచ్ లేదు. అయినా రీతా పోలిక బాగా వుంది.

అతడు అమాంతంగా ఆమెవైపు కదిలాడు.

"హై రీతా!" అన్నాడు.

ఆమె అతడివంక పరీక్షగా చూసింది.

"నన్ను మర్చిపోయావా?" అడిగాడతను.

ఆమె మాట్లాడలేదు. అతడివంకే చూస్తోంది.

ఆమె రీతా కాదనిపించిందతనికి.

"హై, గోపాల్!" అందామె నవ్వుతూ.

"నన్ను పోల్చావన్న మాట!"

"నిన్నెలా మర్చిపోతాను?" అందామె.

"రీతా, ఎలా వున్నావు?"

ఆమె గంభీరంగా నవ్వింది.

"సంవత్సరం క్రితం రీతా అనే పేరుతో నిన్ను కల్సు

వున్న యువతిని నేనే. కాని నా అసలు పేరు గ్లోరి"
అందామె.

"నీ అన్న శామ్సన్ యెలా వున్నాడు?"

"శామ్సన్ నా అన్న కాదు. రెండు రోజులపాటు తన చెల్లెలు రీతాగా నన్ను నటించమన్నాడు. అతడిచ్చిన రెండువేల కోసం అలా నటించాను" అందామె.

"నీ తిలిదండ్రులు అమెరికాలో లేరా?"

"అదంతా అతడు నన్ను నీతో చెప్పమన్న కథ. నేను పెరంబూరులో ఒక చిన్న గదిలో నా తల్లితో జీవిస్తున్నాను."

శామ్సన్ తనని మోసగించాడు. తన దగ్గరనుంచి రెండు లక్షలు పైన కొట్టేశాడు.

"ఆ శామ్సన్ యెక్కడుంటాడు?"

"నాకేం తెలుసు? ఇరవై ఐదు రూపాయలు యిచ్చి ఒక రాత్రి అతడు నాతో గడిపాడు. తర్వాత ఒకరోజున వచ్చి నన్ను రీతాలా నటించమన్నాడు. ఏ ప్రశ్నలు అడగకుండా పనిచేస్తే రోజుకి వెయ్యి ఇస్తానన్నాడు. అతడు చెప్పినదంతా చేసి నాకు రావలసిన డబ్బు తీసుకుని వచ్చేశాను" అందామె.

"ఆ పెద్ద యిల్లు శామ్సన్‌ది కాదా?"

"నాకు తెలియదు" అందామె.

"అంతా వివరంగా చెప్పు" అన్నాడతను.

"చెప్తే నాకేమటొస్తుంది?"

"డబ్బిస్తాను."

"వంద రూపాయలు ఇయ్యి."

అతడు వందరూపాయల నోటు తీసి ఆమెకిచ్చాడు.

"శామ్సన్ నిన్ను నాకు చూపించాడు. కెనాల్ రోడ్డు

వారగా నన్ను దింపాడు. ఫియట్ కారు అక్కడ రెడీగా వుంది. దాని పక్కనే నిలబడి వుండమన్నాడు. నీ కారు వస్తే ఆపి నీతో మాట్లాడమన్నాడు. నువ్వే ఆగి నన్ను పలకరించావు. పెద్దయింటి బిడ్డగా కూడెంటుగా నటిస్తూ నీతో మాట్లాడాను. నామీద నీ మోజు పెరిగింది. నువ్వు నన్ను రేప్ చేసేటట్లు చూడమన్నాడతను. అదే చేశాను నేను. నీకు అడ్డుపడలేదు. మన ఇద్దరం కలిసి వుండగా శామ్సన్ వచ్చాడు, గదిలోకి!"

"అదంతా నాటకమేనా?"

"అంతా నాటకమే" అందామె.

గోపాలరావు పిడికిలి బిగించాడు. తనని అంతగా మోసంచేసిన శామ్సన్ని తను వెతికి పట్టుకోవాలి! అతడికి బుద్ధి చెప్పాలి!

"శామ్సన్ అదే యింట్లో వున్నాడేమో?" అన్నాడతను.

"నేను వెళ్ళి చూడలేదు. అటువైపు ఎప్పుడూ రావద్దన్నాడు. నా అవసరం వస్తే తనే నా గదికి వస్తానన్నాడు" అందామె.

తన విజిటింగ్ కార్డును గోపాలరావు ఆమెకిచ్చాడు.

"శామ్సన్ ఎప్పుడేనా నీ గదికి వస్తే, అతడు అక్కడ వుండగా నాకు ఫోన్ చేసి చెప్పు" అన్నాడతను.

"నాకు యేంతిస్తావు?"

"ఐదువందలు."

"అడ్వాన్స్‌గా వంద ఇప్పుడు ఇస్తే సంతోషిస్తాను" అందామె.

అతడామెకు మరో వందరూపాయలు ఇచ్చాడు.

"పాడయిన ఆ ఫియట్ కారు యెవరిది?"

"నాకు తెలియదు. ఆ థియేటర్ పక్కనే అతడు నన్ను నిలబడమన్నాడు. నీ కారులో ఆ ఆటో మొబైల్ షాపు క్లార్కు ఇగ్నేషస్ కి ఇమ్మన్నాడు. అందుకే అక్కడ ఇచ్చాను" అందామె.

"అసలు ఆ శాంసన్ కి రీతా అనే చెల్లెలు వుందా?" అడిగాడతను.

"నాకు తెలియదు. ఏ ప్రశ్నలూ వేయకుండా నేను పని చేయాలని అతడు మొదటే చెప్పాడు."

విసుగ్గా గోపాలరావు మరో సిగరెట్ వెలిగించాడు. తను డజన్ ఫ్యాక్టరీలు నడుపుతున్నాడు. వేలాది కార్మికులు తనకింద పనిచేస్తున్నారు. కాని ఒక అనామకుడు తన్ని ఫూల్ చేసి, రెండులక్షలు కాజేశాడు.

ఈ లోకంలో యెక్కడున్నా వాడికోసం తను వెతకాలి! అతడిని చిత్రవధ చేయాలి!

ఆమె అతడివంక నవ్వుతూ చూసింది.

"ఆనాటి అనుభవాన్ని నేను మరువలేను. నా గదికి రా ఒకసారి! నువ్వు యేమిచ్చినా చాలు" అందామె.

"చూద్దాం" అని అతడు బయటకు నడిచాడు.

7

తేనాంపేటలోని ఆ యింటిముందు అతడు కారును ఆపాడు. గేటు ముందువున్న వాచ్ మన్ కారు దగ్గరకు వచ్చాడు.

"శాంసన్ వున్నాడా?" గోపాలరావు అడిగాడు.

"శాంసన్ అనే పేరుతో యీ యింట్లో ఎవ్వరూ లేరు, సార్. ఈ యిల్లు అడ్వకేట్ రంగాచారిది" అన్నాడు వాచ్ మన్.

"రంగాచారిగారు వున్నారా?"

"వున్నారు, వెళ్ళండి" అని వాచ్‌మన్ గేటు తెర్చాడు!

కారును లోపలకు పోనిచ్చి ఆపాడతను. కారు దిగి ముందు హాల్లోకి వెళ్ళాడు.

"మీరా, రండి" అన్నాడు అడ్వకేట్ రంగాచారి.

అతడి కెదురుగా గోపాలరావు కూర్చున్నాడు.

"ఇది మీ ఇల్లని ఇప్పుడే తెలిసింది" అన్నాడు గోపాలరావు.

"ఈ మేడ పదేళ్ళపైగా నాదే" అన్నాడు రంగాచారి.

"థామ్సన్ అనే వ్యక్తి మీకు తెలుసా?"

"ఎవరతను?"

"గత సంవత్సరం జనవరి నెల మొదటి వారంలో అతడిని ఇదే ఇంట్లో నేను కల్సుకున్నాను. ఒక రాత్రి యిక్కడే మేడమీది గదిలో పడుకున్నాను."

"గుడ్ హెవెన్స్! డిశంబరు ఆఖరి వారంలో ఇంటి తాళాలు వేసి మేం ఢిల్లీ వెళ్ళాం. జనవరి ఆఖరివారంలో తిరిగి వచ్చాం. ఎవరో ఈ ఇంట్లో రెండు మూడు రోజుల పాటు వున్నారని పక్కవాళ్ళు చెప్పారు. అందుకే యిప్పుడు వాచ్ మన్ని పెట్టాను. ఏ గూండాలో, దొంగలో యీ ఇంట్లో వుండి వుండొచ్చు! కాని మీరు ఇక్కడకు రావడం పై గదిలో పడుకోడం విచిత్రంగా వుంది" అన్నాడు రంగాచారి.

గోపాలరావు మాట్లాడలేదు.

"ఆ థామ్సన్ మీకెలా దొరికాడు?"

"ఏదో వ్యాపారం గురించి మాట్లాడ్డానికి నన్ను అతడు ఇక్కడకు తీసుకొచ్చాడు. ఆ రాత్రి విస్కీ

సేవించి యిక్కడే పడుకున్నాను. ఈ యిల్లు తనదే అన్నాడు."

"రాస్కెల్!" అర్చాడు రంగాచారి.

"మీ వస్తువులు ఏమైనా పోయాయా?"

"ఏమీ పోలేదు. పోతే పోలీసు రిపోర్టు ఇచ్చేవాడిని. తాళాలన్నీ మేం వేసినట్లే వున్నాయి."

"స్కెలిటిన్ కీతో అతడు తాళాలను తెర్చివుంటాడు" అన్నాడు గోపాలరావు.

"అతడు మళ్ళా మీకు యెక్కడేనా కనిపిస్తే నాకు చెప్పండి" అన్నాడు రంగాచారి.

సెలవు తీసుకొని గోపాలరావు బయటకు నడిచి తన కారులో కూర్చున్నాడు. కారును బయటకు పోనిచ్చాడు. అంతా మోసం! తనను ఒక చవటగా చేసి, ఎందుకూ పనికిరాని దద్దమ్మగా చేసి శామ్‌సన్ నాటకమాడాడు. తన దగ్గరనుంచి రెండు లక్షలుపైన గుంజుకుని అదృశ్య మయ్యాడు.

కోపంతో అతడు మండుతున్నాడు. ఇన్ని ఫ్యాక్టరీలు విజయవంతంగా నడుపుతున్న గోపాలరావు చవటకాదని తను ఆ దుర్మార్గుడికి నిరూపించాలి!

టిప్పూ ఆటో మొబైల్ వర్క్‌షాపుముందు అతడు కారును ఆపాడు. కిందకు దిగాడు. నాలుగు కార్ల మధ్య నున్న ఫియట్ కారును చూసి అతడు తృప్తిపడ్డాడు.

ఆనాడు ఆ కారు పక్కనే రీతా నిలబడి వుంది!

వర్క్‌షాపు ప్రొప్రయిటర్ మస్తాన్ అతడి కెదురుగా వచ్చాడు.

"ఆ కారు ఎవరిది?" అడిగాడు గోపాలరావు ఫియట్ వైపు చూపిస్తూ.

"మాదే సార్" అని అతడు ఫియట్ దగ్గరకు నడిచాడు.

బోనెట్ ఎత్తాడు. లోపల ఇంజన్ లేదు!

"సినిమా ప్రొడ్యూసర్లు ఈ కారును షూటింగ్ కోసం అద్దెకు తీసుకుంటారు సార్" అన్నాడు మస్తాన్.

"గత సంవత్సరం జనవరి మొదటి వారంలో యీ కారు శామ్సన్ అనే వ్యక్తికి అద్దెకిచ్చారా?"

"డైరీ చూసి చెప్పాలి, సార్."

"చూసి చెప్పు."

మస్తాన్ లోపలకు వెళ్ళాడు. ఐదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు.

"శామ్సన్ అనే అతడికి వెయ్యి రూపాయలకు అద్దెకిచ్చాం, సార్. యేదో షూటింగ్ వుందని అతడు చెప్పాడు."

"అతడు మళ్ళా కారును మీ దగ్గర అద్దెకు తీసుకున్నాడా?"

"మూడుసార్లు తీసుకున్నాడు. శామ్సనే ఇక్కడకు వచ్చాడు. కాని వేరే నిర్మాతల పేర్లలో అతడు అద్దెకు తీసుకున్నాడు."

"ఈసారి అతడు కారును అద్దెకు తీసుకుంటే వెంటనే నాకు ఫోన్ చేసి చెప్పు. నీకు ఐదువందలు యిస్తాను" అని గోపాల్ రావు తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

దాన్ని చూసి మస్తాన్ తృప్తిపడ్డాడు.

"సార్, మీకు తప్పక ఫోన్ చేసి చెప్తాను. మీ కంపెనీల కార్లను రిపేర్లకు ఇక్కడకు పంపించండి" అన్నాడు మస్తాన్.

"చూస్తాను" అని గోపాలరావు తన కారువైపు

నడిచాడు.

ఆలోచిస్తూ అతడు కారును పోనిచ్చాడు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాంపౌండులో కారును ఆపి దిగాడు. తన మిత్రుడైన డిప్యూటీ ఐ.జి. ఆఫ్ పోలీస్ చంద్రన్ గదిలోకి నడిచాడు.

"హాలో గోపాల్, ఏమిటిలా వచ్చావు?" అడిగాడు చంద్రన్.

"నీతో పనుంది!"

"పనుంటేగాని నువ్వు వస్తావా!" అన్నాడు చంద్రన్ నవ్వుతూ.

అతడి కెదురుగా కూర్చుని గోపాలరావు డిప్యూటీ ఐ.జి. వైపు చూశాడు.

"క్రొత్త పద్ధతిలో శామ్సన్ అనే వ్యక్తి అనేకమంది ధనవంతులను మోసంచేశాడు, ఇంకా చేస్తున్నాడు."

"నువ్వుకూడా మోసపోయావా?"

"అందుకే వచ్చాను. నేను చెప్పేదంతా నీ మనస్సులో వుంచుకో. ప్రస్తుతం ఎవ్వరికీ చెప్పొద్దు."

"చెప్పనులే" అన్నాడు చంద్రన్.

తనకు జరిగినదంతా గోపాలరావు చంద్రన్ తో చెప్పాడు.

"ఇక్కడ విచిత్ర మేమిటో తెలుసా? రీతాగా ఒక యాంగ్లో యిండియన్ యువతి నటించింది. ఇరవై ఐదు రూపాయిలిచ్చి శామ్సన్ ఒక రాత్రి ఆమెతో గడిపాడు. పెద్దింటి పిల్లలా రీతాను చిత్రించి, ఆమెను రేప్ చేసినందుకు నన్ను భయపెట్టి, నన్ను పెద్ద యింట్లో ఖైదీగా వుంచి రెండు లక్షలు ముట్టాక నన్ను శామ్సన్ వదిలేశాడు. ఆ ఇల్లు ఎవరిదో తెలుసా?"

"ఎవరిది?"

"అడ్వకేట్ రంగాచారిగారిది. ఇంటికి తాళాలువేసి వాళ్ళు ఢిల్లీ పోయారు. ఆ సమయంలో ఈ నాటకాన్ని శామ్సన్ ఆ ఇంట్లో ఆడాడు!"

"రియల్లీ బ్రాండ్ న్యూ వే ఆఫ్ చీటింగ్!"

ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"నువ్వు కంప్లెయింట్ రాసి నాకిస్తే మేం అతడి కోసం వెతుకుతాం" అన్నాడు చంద్రన్.

"శామ్సన్ కోసం నేను వెతుకుతున్నాను. అతడు నా కంటబడగానే నీకు ఫోన్ చేస్తాను. అప్పుడు అరస్టు హిమ్!"

"రెడ్ హేండెడ్‌గా పరాయివాడి ఇంట్లో అతడు మాకు దొరికితే తప్పక అరస్టుచేస్తాం" అన్నాడు చంద్రన్.

"నాకు కావలసింది అదే. శామ్సన్ ఇంకా యాక్టివ్‌గా పనిచేస్తున్నాడు. అతను మోసగించిన చవటలెవరూ తనమీద రిపోర్టివ్వరని అతడి నమ్మకం. త్వరలో అతడిని నీకు అప్పగిస్తాను" అని గోపాలరావు బయటకు నడిచాడు.

8

కారు పక్కనే నిలబడివున్న యువతివైపు వుప్పుచెట్టి పరీక్షగా చూసి డ్రయివర్ని కారాపమన్నాడు.

ఇంపాలా కారు ఆగింది. ఆమె వెనుక సీటువైపు కదిలింది. నవ్వుతూ వుప్పుచెట్టికేసి చూసింది.

"ఏమయిందమ్మాయి?" అడిగాడతను.

పంచ, జుబ్బాలో వున్నాడతను. కుడిచేతికి గోల్డు వాచ్ వుంది. మెళ్ళో గొలుసు మెరుస్తోంది.

"నన్ను మెకానిక్ షాపుముందు దింపుతారా?"

"అదేం ప్రశ్న? ఎక్కు, పిల్లా!" అన్నాడతను.

ఆమె వెనుక సీటుమీద కూర్చుంది. తలుపుమూసింది. డ్రయివర్ కారును పోనిచ్చాడు.

కుప్పుచెట్టి ఆమె చెయ్యి పట్టుకుని చేతిలోని గీతలు చూశాడు. మెల్లిగా అతడి చూపు ఆమె ముఖంమీదకు వెళ్ళింది.

"అచ్చంగా నువ్వు అమ్మలులా వున్నావు!" అన్నాడు.

"నా పేరు మేనక, అమ్మలు కాదు" అందామె.

"నిన్ను అమ్మలూ అని పిలుస్తాను" అన్నాడతను.

"మీ ఇష్టం పెద్దలు అలా అంటే వద్దనగలనా!" అందామె.

"బాగా చెప్పావు, అమ్మలూ" అన్నాడతను.

"ఆ వర్క్‌షాపుముందు ఆపమనండి."

డ్రయివర్ ఆపాడు. ఆడపిల్లను చూస్తే కుప్పుచెట్టి హృదయం దడదడమంటుందని డ్రయివర్‌కి బాగా తెలుసు.

టిప్పూ ఆటోమొబైల్ వర్క్‌షాపులో ఒక మెకానిక్‌కి ఆమె కారు యిగ్నిషన్ కీని యిచ్చి, కారును అక్కడకు తెచ్చుకోమంది.

"అలాగేనమ్మా" అన్నాడతను.

ఇంపాలా కదిలింది.

"అమ్మలూ, నువ్వు ఎక్కడికెళ్ళాలి?"

"నా యింటికి."

"నీ యిల్లెక్కడ?"

"కిల్పాక్‌లో, టేలర్స్ రోడ్డు."

"డ్రయివర్ విన్నావా, అటు పద" అన్నాడు

కప్పుచెట్టి.

"మిమ్మల్ని శ్రమ పెడుతున్నాను" అందామె.

"నాకేం శ్రమ? నీ పక్కన కూర్చుంటే అమ్మలు పక్క వున్నట్లే వుంది. టైఫాయిడ్ ఫీవర్ వచ్చి అమ్మలు పోయింది. అప్పుడు యెంత ఏడ్చేనో!" అని కప్పుచెట్టి కళ్ళు తుడుచుకున్నాడు.

ఆమెను దగ్గరగా లాక్కుని, నడుం చుట్టూ చెయ్యి పోనిచ్చి కూర్చున్నాడు.

"నా అమ్మలు! నా అమ్మలు!" అని వంగి ఆమె మెడ మీద ముద్దెట్టుకున్నాడు.

ఆమె నవ్వింది. అతడివంక చూసింది. కప్పుచెట్టి జుత్తు నల్లగానే వుంది. సెంటు సువాసన గుప్పున కొడ్తోంది. అతడి వయస్సు అరవై పైన ఉండొచ్చు!

దాశప్రకాష్ హోటల్ దూరంలో కనిపిస్తోంది.

"అమ్మలుకి ఐస్ క్రీమ్ అంటే మహా యిష్టం. తింటావా?"

"పదండి" అందామె.

"డ్రయివర్, విన్నావుగా!" అన్నాడు కప్పుచెట్టి.

"విన్నాను సార్" అన్నాడు డ్రయివర్.

దాశప్రకాష్ హోటల్ కాంపౌండులో కారు ఆగింది. అతడు దిగాడు. ఆమె వెనకనే దిగింది. ఇద్దరూ ఎర్ కండిషండ్ హాల్లోకి వెళ్లారు. ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

"మీ వయస్సెంత?" అందామె.

"చెప్పుకో!" అన్నాడతను.

"ఏ నలభయ్యో ఉండొచ్చు!" అందామె.

"నేను నలభై ఏళ్ళవాడిలా వున్నానా?" ఆమె

తలాడించింది.

"అమ్మలూ నాకు అరవై దాటింది. గర్వంగా చెప్పు కుంటున్నాను. ప్రతిరోజూ జాగింగ్ చేస్తాను, ఆసనాలు వేస్తాను. నా ఆరోగ్యం ఇంత బాగా అందువల నే వుంది" అన్నాడు కుప్పుచెట్టి.

బేరర్ రాగానే అతడు ఐస్‌క్రీమ్ ఆర్డరిచ్చాడు. ఆమెవైపు నవ్వుతూ చూశాడు. డెంటిస్టు కట్టిన అతడి పళ్ళు తెల్లగా మెరుస్తున్నాయి.

"నీ యింట్లో యెవరెవరుంటున్నారు?"

"నాన్న, అమ్మ, అన్నయ్యా, నేను మేం నలుగురమే. ప్రస్తుతం అమ్మా, నాన్నా పారిస్‌లో ఉన్నారు. నాన్న పేరు మీరు వినే వుంటారు, డాక్టర్ శివరాజన్. ఆయన పేరుపొందిన సైకియాట్రిస్టు. అన్నయ్య సి.ఎ. చేస్తు న్నాడు" అందామె.

ఐస్‌క్రీమ్ పెద్ద కప్పుల్లో వచ్చింది. ఇద్దరూ తినడం ప్రారంభించారు.

"నువ్వు నా అమ్మలువే అనిపిస్తోంది. విధి నిన్ను నా దగ్గరకు పంపింది. నిన్ను వదలబుద్ధి కావడంలేదు" అన్నాడతను.

కళ్ళు చిట్లించి ఆమె నవ్వింది.

"నీతో గంటల తరబడి కూర్చోవాలనిపిస్తోంది. నీతో ఎంతో మాట్లాడాలి. నా అమ్మలుకు చెప్పనిదెంతో నీతో చెప్పుకోవాలి" అన్నాడతను.

"చెప్పండి" అందామె.

"చేపల బజారులో పాట కచ్చేరీలా యిక్కడేం చెప్పగలను? ఒక చక్కని గదిలో మనిద్దరం పక్క పక్కనే కూర్చుని వుండాలి. అప్పుడు నా అమ్మలుకు

అంతా చెప్తాను" అన్నాడతను.

అతడు డబ్బు చెల్లించాడు. బేరర్ అతడికి నమస్కరించాడు. కుప్పుచెట్టి పక్కనే వయ్యారంగా ఆమె ఇంపాలా కారువైపు నడిచింది.

ఆమె ఎక్కాక పక్కనే అతడు కూర్చున్నాడు. డ్రయివర్ తలుపు మూశాడు. ఇంపాలా కారు కదిలింది. ఆమె చెప్పిన యింటికి కొంచెం దూరంలో ఆగింది.

అతడామె చెయ్యి పట్టుకున్నాడు.

"మీ మాటలు వినాలని నాకెంతగానో వుంది. రేపు సాయంత్రం ఆరింటికి రండి. అన్నయ్య ఇంట్లో వుండడు. మనం యింట్లో కూర్చుని మాట్లాడుకోవచ్చు" అందామె.

"అమ్మలూ, అలాగే వస్తాను" అన్నాడతను.

డ్రయివర్ కారును పోనిచ్చాడు.

"డ్రయివర్ ఎలా వుంది పిల్ల?" అడిగాడతను.

"నిజంగా మేనకే సార్" అన్నాడు డ్రయివర్.

9

సరిగ్గా ఆరుగంటలకు కారు ఆమె యింటి ముందు ఆగింది. కారుని చూసి ఆమె గేటువైపు పరుగెత్తుకొచ్చింది.

"రండి" అందామె.

"డ్రయివర్, కారును యింటికి తీసుకుపో. కావాలిస్తే ఫోన్ చేస్తాను. వెంటనేరా! నేనెక్కడున్నదీ ఎవ్వరికీ తెలియకూడదు" అన్నాడు కుప్పుచెట్టి.

లెదర్ బాగ్ పట్టుకుని అతడు కిందకు దిగాడు. కారు వెళ్ళిపోయింది. ఆమె భుజం మీద ఒక చెయ్యివేసి కుప్పుచెట్టి ముందు హాల్లోకి వెళ్ళాడు.

పక్కనున్న పడగ్గదిలోకి యిద్దరూ నడిచారు.

"ఇది నా గది" అందామె.

"నీలాగే అందంగా వుంది" అన్నాడతను.

సోఫా చూపించి ఆమె అతడిని కూర్చోమంది. అతడు పరుపువైపు నడిచాడు.

"నాకు సోఫాలు నచ్చవు. పరుపుమీద కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడతను.

"మీ యిష్టం" అందామె.

టేబుల్ మీద పెట్టిన బాగ్ వంక ఆమె చూసింది.

"అందులో ఏముంది?"

"నా అమ్మాయికి ప్రెజెంటు" అన్నాడతను.

ఆమె పరుపు పక్కకు నడిచింది. అతడివైపు నవ్వుతూ చూసింది.

"ఆ అమ్మాయి ఎవరోగాని మీకు ఆమె అంటే చాలా ప్రేమ" అందామె.

"అమ్మాయి ఎవరో వూహించు!"

"మీ అమ్మాయేమో!"

"కాదు."

"మీ ముద్దుల కూతురై వుండాలి."

"నాకు పిల్లలు లేరు!" అన్నాడతను.

ఆమె కాస్సేపు ఆలోచించి, యేమీ తోచక, "ఏమో!" అంది.

కప్పు చెట్టి నవ్వాడు. ఆమెను చెయిపట్టుకొని లాగాడు. ఆమె అతడిమీద పడింది.

అతడి చేతులు ఆమెను చుట్టేశాయి.

"అమ్మాయి ఎవరో చెప్పనా?"

"చెప్పండి" అందామె.

అమాంతంగా అతడామె పెదిమలను బలంగా ముద్దెట్టుకున్నాడు.

"ఇప్పుడు తెలిసిందా? అమ్మలు నా మొదటి భార్య. పెళ్ళయిన సంవత్సరం లోపలే చచ్చిపోయింది. ఆ అమ్మలే నీ రూపములో తిరిగి వచ్చింది."

ఆమె పరుపుమీద దూరంగా జరిగింది.

"నేను పద్దెనిమిదేళ్ళ యువతిని. నన్ను పెళ్ళాడబోయే యువకుడు కెనడాలో వున్నాడు. మీరు అమ్మలుగా నన్ను చూడొద్దు" అందామె.

"అమ్మలూ, ఇలా కూర్చో! ఆ బాగ్ లో నీకోసం ఐదు లక్షలు తెచ్చాను. ఆ నోట్లకట్టలను చూస్తే నువ్వు గంతులేస్తావు!"

బయటినుంచి ఎవరో పిల్చారు. ఆమె బయటకు పరుగెత్తింది.

రెండు నిమిషాల తర్వాత తిరిగి వచ్చింది.

"ఎవరు?" అడిగాడు కుప్పుచెట్టి.

"లాండ్రీ వాడు—అన్నయ్య గుడ్డలు తెచ్చాడు. అన్నయ్య గదిలో పెట్టాను" అందామె.

"మీ అన్నయ్య ఇప్పుడు రాడుగా?"

"ఏ ఒంటిగంటకో వస్తాడు."

"అతడి పేరు?"

"నాగరాజు" అందామె.

"ఇలా కూర్చో!" అన్నాడతను.

"వద్దంటే మీరు వినరు" అంటూ ఆమె వెళ్ళి పరుపు మీద కూర్చుంది.

కుప్పుచెట్టి ఆమె గడ్డాన్ని మెల్లగా నిమిరాడు.

"అమ్మలూ, ఏళ్ళతరబడి పాటుబడి నేను కోట్లు గడిం

చాను. నా యింట్లో నోట్లకట్టలు మూలుగుతున్నాయి, కాని సుఖమంటే ఏమిటో నే నెరగను."

"నాకూ తెలియదు. నేను కాలేజీలో చదువుకొంటు న్నాను. జీవితం గురించి నాకింకా ఏమీ తెలియదు" అందామె.

"తెలియకపోతే చెప్పడానికి నేనున్నానుగా, అమ్మలూ?" అన్నాడతను.

ఆమె అతడి ఛాతీమీద ముఖాన్ని ఆనించింది.

"మీకెందుకు సుఖం లేదు?"

"నా అమ్మలు తప్ప మరెవ్వరూ నన్ను సుఖపెట్టలేరు. నా అమ్మలు నువ్వే!"

"ఈ అమ్మలుకి ఏమీ తెలియదు!" అందామె.

అతడు నవ్వుతూ ఆమెను తోశాడు. వెల్లకిలా ఆమె పరుపుమీద పడింది. ఆమె మీదకు ఆత్రంగా వాలేడతను.

ఆమె తటాలున లేచింది. అతడివైపు నవ్వుతూ చూసింది.

"కాస్సేపు అమ్మలు పేరు స్మరిస్తూ కూర్చోండి. నేను స్నానంచేసి వస్తాను" అందామె.

ఆమె యటాచ్డ్ బాత్‌రూమ్‌లోకి దూరి తలుపును మూసుకొంది.

అతడు కిందకు దిగాడు. బాత్‌రూమ్ తలుపు పక్కనే నిలబడ్డాడు. తలుపును తట్టాడు.

"అమ్మలూ, తొందరగా రా!" అన్నాడతను.

"నేను రాలేను. మీరే తీసుకెళ్ళండి" అందామె.

అతడు తలుపును తోశాడు. తెరచుకుంది. ఆమె పల్చటి నిల్కు నైటీలో వుంది. ఆమె మెల్లిగా గుమ్మంవైపు వచ్చింది.

"అతడామెను యెత్తుకని, మోసుకెళ్ళి పరుపుమీద పడుకోబెట్టాడు.

గదిలో ఫ్లోరసెంట్ లైట్ వెల్గుతోంది. కుప్పుచెట్టి ఆమెను ఆవేశంలో ముద్దాడాడు. ఆమె చిలిపిగా నవ్వింది.

కుప్పుచెట్టి కళ్ళు మెరిశాయి. అతడిలో గాలివానలా కోరిక చెలరేగింది. ఆమె అతడికి దూరమవడానికి ప్రయత్నించలేదు. అతడిలో చెలరేగిన కోరికల కెరటాల్లో ఆమె మునిగి తేలింది. ఇద్దరూ స్వర్గంలో విహరిస్తున్నారు.

అమాంతంగా తలుపును తోసుకొని ఒకతను గదిలో కొచ్చాడు.

"అన్నయ్యా!" అని ఆమె ఏడ్వసాగింది.

అతడు కోపంగా కుప్పుచెట్టిని కిందకు లాగాడు.

"ఓల్డ్ రాస్కెల్, నా చెల్లెల్ని బలాత్కరించావా?" అరిచాడతను.

కుప్పుచెట్టి నవ్వుతూ అతడివంక చూశాడు.

"అరిచి ఆయాసపడకు, అబ్బాయి. నీకేం కావాలో చెప్పు!" అన్నాడతను.

ఆమె నేలమీద కూర్చుని యేడుస్తోంది.

"నా చెల్లెలు జీవితాన్ని నాశనం చేశావు!" అరిచాడు నాగరాజు.

"కూలిపోయిన ఇళ్ళను మళ్ళా కట్టొచ్చు. పగిలిన వస్తువులను మళ్ళా కొనుక్కోవచ్చు. ఎంతకావాలో చెప్పు!"

"ఐదు లక్షలు యిస్తే నిన్ను వదిలేస్తాను. నా తల్లిదండ్రులకు ఇదంతా తెలియకుండా చూడాలి. వాళ్ళకు తెలిస్తే నిన్ను వదలరు" అన్నాడతను.

"అబ్బాయి, ఆ లెదర్ బాగ్‌లో ఐదు లక్షలుంది.

తీసుకో. నా ఇంటికి ఫోన్ చేసి నాకోసం కారు పంపమను. నే వెళ్తాను" అన్నాడు కుప్పుచెట్టి.

అతడు లెదర్ బాగ్ జిప్పును తెర్చి నోట్లవైపు సంతోషంగా చూశాడు.

"ఈ డబ్బు నీకు రాదు!" అన్నారెవరో వెనకనుంచి.

అతడు వెనక్కు తిరిగాడు. ఆశ్చర్యంతో గోపాలరావు వంక చూశాడు. అతడి చేతిలో పిస్టలు మెరుస్తోంది.

"నువ్వు ఇక్కడికెలా వచ్చావు?"

"నువ్వు వచ్చినట్లే" అన్నాడు గోపాలరావు.

అదే సమయంలో ఇన్‌స్పెక్టర్ బాండ్ ఆరుగురు కానిస్టేబుళ్ళతో లోపలకు వచ్చాడు.

"ఇన్‌స్పెక్టర్ బాండ్, అరస్టుహిమ్" అన్నాడు గోపాలరావు.

అతడి చేతులకు ఇన్‌స్పెక్టర్ బాండ్ బేడీలు వేశాడు.

ఇన్‌స్పెక్టర్ బాండ్, గోపాలరావు కేల మీద కూర్చుని యేడుస్తున్న ఆమె వంక చూశాడు.

"నీ పేరు?

"కనకం."

"నాతో తన పేరు మేనకని చెప్పింది" అన్నాడు కుప్పుచెట్టి.

"మేనకలా నటించడానికి ఇతడు నీకు ఎంత ఇచ్చాడు" అడిగాడు గోపాలరావు.

"రెండు వేలు" అందామె.

"ఇతడు నీకెలా తెలుసు?"

"అప్పుడప్పుడు నా ఇంటికి వచ్చేవాడతను. డబ్బిచ్చి నాతో రాత్రిళ్ళు వుండేవాడు."

"ఇతడి అసలు పేరు యేమిటి?"

"నాకు తెలియదు. నాగరాజు పేరుమాత్రం నాకు తెలుసు" అందామె.

"ఇన్ స్పెక్టర్, ఇంజన్ లేని ఆ కారును మీరు చూశారు. కనకాన్ని తీసుకొచ్చి, ఆమె పేరు మార్చి, పెద్దింటి పిల్లలా ఆమెను చిత్రించి, యీ ఇంట్లో నాటక మాడి అతడు కుప్పుచెట్టిగారి నుంచి ఐదు లక్షలు తీసుకో డానికి ప్రయత్నం చేస్తున్నాడు" అన్నాడు గోపాల రావు.

"ఆమె ఒక సామాన్య వేశ్య!" అన్నాడు కుప్పుశెట్టి అసహ్యంతో.

ఇన్ స్పెక్టర్ బాండ్, గోపాలరావు బేడీలు వేసిన వ్యక్తి ముందుకు వెళ్ళారు.

"ఈ ఇల్లు యెవరది?" అడిగాడు గోపాలరావు.

"నాదే. నేను కొన్నాను" అన్నాడతను.

"నీ అసలు పేరు?" అడిగాడు ఇన్ స్పెక్టర్.

"మాధవ నాయర్. ఆ పేరుతోనే యీ ఇల్లు కొన్నాను."

"ఇల్లంతా సోదాచేయండి" అర్చాడు ఇన్ స్పెక్టర్ బాండ్.

అరగంటలో అంతా తేలిపోయింది. యాభై లక్షలు పైన రొఖ్ఖంగా పోలీసులకు దొరికింది.

"అంతా బ్లాక్ మనీ!" అన్నాడు గోపాలరావు.

"ఇంతవరకూ యెంతమంది నీకు యిలా డబ్బు చెల్లిం చారు?" అడిగాడు బాండ్.

"యాభైమందికి పైన వుంటారు."

"ఒక్కరు కూడా మాకు రిపోర్టివ్వలేదు. లక్షలిచ్చి

నోళ్లు మూసుకొని కూర్చున్నారు" అన్నాడు బాండ్.

"నేనూ ఐదులక్షలిచ్చి నోరు మూసుకొని వుండే వాడిని" అన్నాడు కుప్పుచెట్టి.

ఇన్‌స్పెక్టర్ బాండ్ హుషారుగా గోపాలరావుతో కరచాలనం చేశాడు.

"మీరు పట్టుదలతో కృషిచేసి ఇతడిని మాకు పట్టిచ్చినందుకు మీకు నా జోహార్లు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ బాండ్.

—:అ యి పో యి ం ది:—